ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుస్సుపై స్పెషల్ డ్రైవ్

చాదర్‌ఘాట్: ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుస్సు (ఐఎంఐ)పై ఈనెల 28వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మలక్‌పేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజున్నిషా తెలిపారు. ఓల్డ్‌మలక్‌పేట యూపీహెచ్‌సీలో స్పెషల్ డ్రైవ్‌పై గురువారం ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలియో, బీసీజీ, పెంటా, ఐపీవీ, డీపీఐ ఎంఆర్ వ్యాధి నిరోధక టీకాలు స్లమ్ ప్రాంతాల్లో టీకాలు వేయించని వారిని గుర్తించి వాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. మలక్‌పేట నియోజకవర్గంలో దాదాపు 27 మందిని గుర్తించి వారికి టీకాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్‌ను ముగ్గురు అధికారులు పరివేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో కాలనీ అధ్యక్షులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలి

నాగోలు: కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరో 27 మందిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్ చేసిన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఓపక్క మావోయిస్టులు కాల్పుల విరమణ ప్రకటించి చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెప్పినా కేంద్ర ప్రభుత్వం వారి మాటలు పెడచెవిన పెట్టడం సరికాదన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం

చంపాపేట: రాష్ట్రంలోని ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమమే రాష్ట్ర ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కార్తీక్ అన్నాడు. గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ఎస్‌ఆర్‌డీజీ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరం సంఘం నూతన డైరీ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాద్, మోయిజ్, నిజాముద్దీన్, రమేష్, పవన్‌కళ్యాణ్, వెంకటరెడ్డి, అనిత, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన

చైతన్యపురి: ఫణిగిరికాలనీ, బాబు కాంప్లెక్స్, న్యూదిల్‌సుఖ్‌నగర్ కాలనీల్లో గురువారం చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా పర్యటించారు. భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు వచ్చిన ప్రాంతాల్లోని స్థానికులతో మాట్లాడారు. సివరేజీ లైన్లను శుభ్రం చేసి దుర్గంధం సమస్యను పరిష్కరించి, వర్షానికి పాడైన రహదారులకు మరమ్మతు పనులు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ సుజాతను కోరారు.

సరూర్‌నగర్‌లో కారు బీభత్సం

చైతన్యపురి: మద్యంమత్తులో డ్రైవింగ్ చేయటంతో అదుపుతప్పిన కారు బీభత్సం సృష్టించింది. ఎస్సై మహేందర్ వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున జోనల్ ఆఫీస్ రోడ్డు సరూర్‌నగర్ చౌడీ సమీపంలో వేగంగా వచ్చిన కారు అపార్టుమెంట్ ముందు పార్కు చేసిన రెండు కార్లను ఢీకొట్టింది. కారు నడిపిన వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. కారులో మద్యం బాటిళ్లు ఉండటంతో మద్యంమత్తులో కారు నడిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు

సైదాబాద్: ఆటో ఢీకొని ఓ వృద్ధుడు గాయపడిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో నివసించే బచ్చయ్య (78) ఈ నెల 20న భార్య ముత్యాలమ్మతో కలిసి నల్గొండలో బంధువుల శుభాకార్యానికి వెళ్లాడు. అదేరోజు రాత్రి చంపాపేట ఫోకస్ ఆసుపత్రి వద్ద బస్సు దిగి అక్కడి రహదారి దాటుతుండగా కర్మన్‌ఘాట్ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన ఆటో అతడిని ఢీకొట్టడంతో తల, కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

చైతన్యపురి: డ్యూటీకని వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల గణేష్‌పురి కాలనీకి చెందిన ఆనంద్‌కుమార్ (40) కొన్నాళ్లుగా స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 15న డ్యూటీకని వెళ్లి రాత్రైనా రాలేదు. గతంలోనూ మూడు నాలుగు రోజులు ఇలాగే వెళ్లి వచ్చేవాడని ఈ సారి ఎంతకీ రాకపోవడంతో భార్య ఉమ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సరస్వతీనగర్‌లో..

సైదాబాద్: ఒంటరిగా ఉంటున్న వృద్ధుడు అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... సరస్వతీనగర్‌లో నివసించే కంభాలపల్లి జలంధర్‌రెడ్డి(70) అతడి భార్య విజయలక్ష్మి మార్చిలో అమెరికాలో ఉంటున్న తమ కూతుళ్ల వద్దకు వెళ్లింది. అప్పటి నుంచి జలంధర్‌రెడ్డి ఒక్కడే ఉంటున్నాడు. ఈ నెల 20న అతని సోదరుడు సుధాకర్‌రెడ్డి మరికొందరు బంధువులతో సోదరుడిని కలిసేందుకు సరస్వతీనగర్‌కు వచ్చాడు. అయితే ఇంటికి తాళం వేసి ఉండటంతో తెరిచి చూడగా జలంధర్‌రెడ్డి సెల్‌ఫోన్, వ్యక్తిగత డాక్యుమెంట్లు ఇంట్లోనే ఉన్నాయి. ఎదురింటి వాచ్‌మన్‌ను అడగ్గా ఈ నెల 19న బ్యాగ్‌తో ఆటో ఎక్కి వెళ్లాడని చెప్పారు. చుట్టుపక్కల, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు.


ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో నిలిచిన వరద నీరు

టీవీసీసీ కార్యాలయంలో తడిసిపోయిన రికార్డులు


టీవీసీసీ ప్రాంగణంలో చేరిన వరదనీరు


వాన కుమ్మేసే.. వరద కమ్మేసే

భారీ వర్షానికి ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో భారీగా నీరు నిలిచింది. మలక్‌పేటలోని **వికలాంగుల సంక్షే**మ కార్యాలయంలోని రికార్డులు తడిసిపోయాయి. ట్రైసైకిల్ తయారీ **ప్రాంగణంలో భారీ**గా నీరు నిలిచింది. మూసారంబాగ్‌లో పైపులైన్ల కోసం తవ్విన రోడ్లు వర్షం **తాకిడికి మట్టికొట్టు**కుపోయి గుంతలమయంగా మారాయి. శాలివాహననగర్, దిల్‌సుఖ్‌నగర్, **భవానినగర్ రోడ్డు**, సలీంనగర్ ప్రాంతాల్లోని రోడ్లు గుంతలుగా మారాయి. చంపాపేట చౌరస్తా **ప్రధాన రహదారి** సమీపంలోని ఇళ్ల సెల్లార్‌లోకి నీరు చేరిందని విషయం తెలుసుకున్న **కార్పొరేటర్ వంగ** మధుసూదన్‌రెడ్డి పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. గడ్డిఅన్నారం **డివిజన్‌లోని సరూర్**నగర్ లోతట్టు కాలనీలలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పర్యటించారు. ఆయా **కాలనీల్లో నిలిచిన** నీటిని తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. నాగోలు **బండ్లగూడ అయ్య**ప్పనగర్‌లో ఓ ఇంట్లోకి వరద నీరు చేరింది.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


ఎల్‌బీనగర్ పాత విలేజ్‌లో..


కామినేని నుంచి సిరీస్ రోడ్డులో..



గడ్డిఅన్నారం డివిజన్‌లో నిలిచిని నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


బండ్లగూడలో రోడ్లపై పొంగుతున్న డ్రైనేజీ


సెల్లార్‌లోకి చేరిన నీటిని పరిశీలిస్తున్న వంగ మధుసూదన్‌రెడ్డి




అయ్యప్ప కాలనీలో రాత్రి కురిసిన వర్షానికి ఇళ్లలోకి చేరిన నీరు

పెండింగ్ పనులన్నీ పూర్తి చేయండి

ఎల్‌బీనగర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని గ్రేటర్ కమిషనర్ ఆర్.వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన వెంకటేశ్వరాకాలనీలో పర్యటించి కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించగా వివిధ సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో కొనసాగుతున్న బాక్స్ డ్రైయిన్ పనులను పరిశీలించారు. వర్షాకాలం రాకముందే పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ హేమంతకేశవపాటిల్, జాయింట్ కమిషనర్ కృష్ణకుమారి, ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, డీసీ సుజాత ఉన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

పార్కు స్థలం కాపాడుకోవటం అభినందనీయం

మన్సూరాబాద్: కాలనీలోని పార్కు స్థలం కబ్జా కాకుండా కాలనీవాసులు కాపాడుకోవటం అభినందనీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని సిరిహిల్స్‌కాలనీలో గురువారం ఆయన పర్యటించి మాట్లాడారు. పార్కు సమీపంలోని మరో కాలనీ ఓపెన్ స్థలంలో సొంత నిధులతో కాలనీవాసులు కమ్యూనిటీహాల్ నిర్మించుకోవడం హర్షణీయమన్నారు. కాలనీలో మిగిలిపోయిన డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు త్వరలోనే వేయించి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, ఆనంద్‌రెడ్డి, వీరచందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.


పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

ఓపెన్ జిమ్ ప్రారంభం

ఎల్‌బీనగర్: కాలనీలోని ప్రతి పార్కును అభివృద్ధి చేసి జిమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వైదేహినగర్ కాలనీలో స్వామి వివేకానంద పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను గురువారం ఆయన కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అభివృద్ధికి అసోసియేషన్ అధ్యక్షులు మల్లేశంకు రూ.50 వేలు, కోశాధికారి జయరామశర్మకు రూ.50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కిషన్‌రావు, శివరంప్రసాద్, జంగారెడ్డి, సురేష్, సుజాత పాల్గొన్నారు.


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

మలక్‌పేటలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

చాదర్‌ఘాట్: రానున్న ఎన్నికల్లో మలక్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగరేస్తామని మలక్‌పేట కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ అక్బర్ పేర్కొన్నారు. గురువారం ఆజంపురాలో నిర్వహించిన మలక్‌పేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు కార్యకర్తలు ఐకమత్యంతో పని చేయాలన్నారు. మలక్‌పేట నియోజకవర్గానికి సంబంధించిన విషయాలను పార్టీ పరిశీలకులు అధిష్ఠానానికి నివేదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు కృషి చేసే వారికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గురించి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు సుబ్రహ్మణ్యం, సురేష్ మాట్లాడుతూ.. ఏఐసీసీ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లు కిషన్, బాబు శ్రీనివాస్, సోహెల్, కృష్ణ, జఫర్, ఇక్బాల్, రాజు, అశ్వక్‌ఖాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ అక్బర్

డ్రైనేజీ పనుల ప్రారంభంలో జాప్యమెందుకు?

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి బృందావన్ మేడోస్ కాలనీలో మంజూరైన డ్రైనేజీ పనులను ప్రారంభించకపోతే నిరాహార దీక్ష చేపడుతామని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం కాలనీవాసులతో కలిసి నిలిచిపోయిన డ్రైనేజీ పనులు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..,కష్టపడి కాలనీకి డ్రైనేజీ కోసం నిధులు మంజూరు చేయించుకుంటే రాజకీయ నాయకులు అధికారుల నడుమ సమన్వయం లేక మా కాలనీకి శాపంగా మారిందన్నారు. డ్రైనేజీ కోసం రైతుల సైతం భూములు ఇచ్చారని, త్వరలో పనులు చేస్తామని హామీలు కూడా ఇచ్చారని అయిన పనులు మాత్రం ప్రారంభం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేం ఏ రాజకీయ పార్టీలకు అనుకూలం, వ్యతిరేకం లేమని తమ కాలనీల అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. నిరసనలో శశికాంత్, చిత్తరంజన్, నందకిషోర్, ప్రభాకర్, జగన్, సహదేవ్, శివశంకర్, రామస్వామి పాల్గొన్నారు.

హస్తినాపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని సమస్యల పరిష్కారానికి కావాల్సిన నిధులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా సాగర్‌రింగ్‌రోడ్డు నుంచి గుర్రంగూడ వరకు ఫ్లై ఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అదేవిధంగా టీకేఆర్ కమాన్ నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు నిర్మించనున్న ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

పకడ్బందీగా మాన్సూన్ యాక్షన్ ప్లాన్

చాదర్‌ఘాట్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మాన్సూన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని మలక్‌పేట జలమండలి డీజీఎం హస్మత్‌అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యాన్‌హోళ్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని లోతైన మ్యాన్‌హోళ్ల మూతలపై ఎరుపు రంగు వేయాలని అధికారులకు సూచించామన్నారు. వరద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు సిద్ధం చేశామన్నారు. ఇప్పటి నుంచే వరద నీటి ప్రాంతాలపై తగిన శ్రద్ధ ఉంచాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అదే విధంగా సిబ్బంది కూడా వ్యక్తిగత రక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మిషన్లు కంట్రోల్‌లో ఉన్నాయో లేదో చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.



ఘనంగా హనుమాన్ జయంతి

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ లావణ్య పర్యవేక్షణలో సింధూర అభిషేకం, ఆకుపూజ, అర్చనలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

మన్సూరాబాద్‌లో..

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లో పలు ప్రాంతాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

మోహన్‌నగర్‌లో..

నాగోలు: హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో హనుమాన్ యువసేన అధ్యక్షుడు యశ్పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో హోమం, హనుమంతుడికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, నాయకులు భరత్ కుమార్ గౌడ్, గీతారెడ్డి, మహిపాల్ రెడ్డి, బొక్కబాల్ రెడ్డి, లింగాల నాగేశ్వరరావు గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్లలో..

సైదాబాద్: ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్ల పరిధిలోని పలు ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసాయి.తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. సైదాబాద్ శంకేశ్వరబజార్‌లోని శివాలయంలో నిర్వహించిన హోమంలో ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ దంపతులు జంగం శ్వేతామధుకర్ రెడ్డి పాల్గొన్నారు. సైదాబాద్ పూజలబస్తీలోని శ్రీశివాంజనేయ స్వామి దేవాలయంలో సుభాష్‌చందర్జీ పూజల్లో పాల్గొన్నారు.

రామకృష్ణపురం డివిజన్‌లో..

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణపురం డివిజన్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఆర్‌కేపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డి పాల్గొని మాలధారణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి, పున్న నిర్మల గణేష్, బండి మధుసూదన్ రావు, తలాటి రమేష్ నేత, సురేష్ పాల్గొన్నారు.






పూజల్లో పాల్గొన్న దేప సురేఖ భాస్కర్‌రెడ్డి


ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో..


పూజల్లో కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్